మజ్లిస్ సెక్యులర్ పార్టీ: కౌసర్


ఎమ్మెల్యేకు పతంగి మెమోంటో అందజేస్తున్న మజ్లిస్ నాయకుడు

గోల్కొండ: మజ్లిస్ పార్టీ సెక్యులర్ పార్టీ కావడంతోనే అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం కార్వాన్‌కు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు ఆయనను కలిసి పతంగి మెమోంటోను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ పుట్టుకతోనే సెక్యులర్ భావాలతో పుట్టిందన్నారు. నగరానికి దళిత మేయర్‌ను అందించిన ఘనత మజ్లిస్ పార్టీదే అని ఆయన గుర్తు చేశారు. కార్వాన్‌లోని కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి దాని అభివృద్ధికి ప్రతినిత్యం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్, జుబేర్, రఫత్ తదితరులున్నారు.

అందరి సహకారంతో కృష్ణాష్టమి వేడుకలు విజయవంతం


మెమోంటోల పంపిణీ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సునీల్‌యాదవ్

గోల్కొండ: అందరి సహకారంతో కృష్ణాష్టమి వేడుకలు విజయవంతమయ్యాయని బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్ అన్నారు. మంగళవారం రాంసింగ్‌పురాలో పలువురికి ఆయన మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్మాష్టమి వేడుకలు భారీ ఎత్తున నిర్వహించామని ఇందులో ప్రతి ఒక్కరి సహకారం ఉందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, మల్లేష్‌యాదవ్, రామకృష్ణచారి, సి.రాజేష్, వేణు తదితరులున్నారు.

ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలి

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్స్‌లో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని పర్యావరణ కార్యకర్త మహ్మద్ ఆబిద్ అలీ పేర్కొన్నారు. ఆయన నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఆబిద్ అలీ మాట్లాడుతూ..నగరంలోని అనేక పార్కుల్లో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కానీ పబ్లిక్‌గార్డెన్స్‌లో ఓపెన్ జిమ్ లేకపోవడం శోచనీయమన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు పబ్లిక్ గార్డెన్‌ను గాలికి వదిలేసినట్లు వివరించారు.

పాతబస్తీలో ఉద్రిక్తత

చాంద్రాయణగుట్ట: రక్షాపురం ప్రధాన రహదారిలోని ఒక ప్రార్థనా మందిరంలో విగ్రహాలు ధ్వంసం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం రాత్రి ఆలయ పర్యవేక్షకుడు ఆలయానికి తాళం వేసి వెళ్లాడు. రాత్రి 11.30 గంటల సమయంలో కొందరు యువకులు వచ్చి విగ్రహాలు ధ్వంసం చేసి పారిపోతుండగా..పక్కనే ఉన్న ఆలయ పర్యవేక్షకుడు గమనించి కేకలు వేశాడు. అప్పటికే వారు పారిపోయారు. సమాచారం అందుకున్న ఒక వర్గం నేతలు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో కలిసి ఆందోళనకు దిగారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఏసీపీలు మహ్మద్ గౌస్, మనోజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ బందోబస్తును పర్యవేక్షించారు. మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు సలీం బేగ్, ఆజం షరీఫ్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మతి స్థిమితం సరిగ్గా లేని వ్యక్తి ఈ ఘటనకు పాల్పడ్డాడని, అతడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇద్దరు వ్యక్తులు ధ్వంసం చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకున్న సంతోష్‌నగర్ పోలీసులు మంగళవారం రాత్రి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నేత్రదానానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలి


అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీహెచ్ రవీంద్రనాయక్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసి ఇతరులకు వెలుగునివ్వాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. ఈ మేరకు కోఠి డీఎంహెచ్ఎస్‌లోని తెలంగాణ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరేట్ వద్ద కృష్ణగిరి ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందత్వ నివారణపై అవగాహన ర్యాలీ, నేత్రదానంపై ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్ హాజరై అందత్వ నివారణ అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు 11 లక్షల మంది కార్నియల్ (నల్ల గుడ్డు) మార్పిడి కోసం వేచి ఉన్నారన్నారు. ప్రతి సంవత్సరం 25 వేల మంది కార్నియల్ వ్యాధికి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా పిల్లల్లో పౌష్టికాహారం లేకపోవడం వల్ల కార్నియల్ వ్యాధి వస్తుందన్నారు. అదేవిధంగా చాలా మందిలో ప్రమాదాల వల్ల నల్లగుడ్డు దెబ్బతింటుందన్నారు. అందత్వ నివారణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అందత్వ నివారణ సంస్థ జాయింట్ డైరెక్టర్ మోతిలాల్ నాయక్, కృష్ణగిరి ఐ ఫౌండేషన్ చైర్మన్ గోవింద్ హరి, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థినుల నిరసన ర్యాలీ


మెహిదీపట్నం వద్ద సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ర్యాలీ

గోల్కొండ: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన అమానుష కాండను నిరసిస్తూ మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రతినిధులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని భారీ ప్రదర్శన నిర్వహించారు. సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల జర్నలిజం విభాగానికి చెందిన డాక్టర్ పి.భారతీ మాట్లాడుతూ.. కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన ఈ దుర్ఘటన సభ్య సమాజానికే మాయని మచ్చ అని అన్నారు. ఈ దుర్ఘటన జరిగి రోజులు గడుస్తున్నా నిందితుడిపై కేసులు నమోదు కాకపోవడం వల్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఇన్‌చార్జి నవీనాతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయండి


మాట్లాడుతున్న ఆదిల్ షరీఫ్

అబిడ్స్: పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్)ను అమలు చేయాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జీహెచ్ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి లక్షలాది మంది ఉద్యోగులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టే వరకు ఉద్యోగుల ఆందోళనలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, రమేష్, శివకుమార్, మోజెష్, ఏవీఎస్.గాంధీ, మెర్సీ, పోలాడి రాజు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


పూజలు నిర్వహిస్తున్న మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల పండుగలకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటే విధంగా పండుగలను ప్రభుత్వం నిర్వహిస్తుందని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరి వ్రతాలు



విజయనగర్‌కాలనీ: శ్రావణమాసం చివరి మంగళవారాన్ని పురస్కరించుకొని మహిళలు మంగళగౌరి దేవికి వ్రతాలు నిర్వహించారు. ఆసిఫ్‌నగర్ జగదాంబ ఆలయం, దాయిబాగ్ హనుమాన్ బాలాజీ మందిరం, విజయనగర్‌కాలనీ లక్ష్మీగణపతి ఆలయాల్లో అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు ముత్తైదువులను ఆహ్వానించి మంగళగౌరి వ్రతాన్ని నిర్వహించారు.

హబీబ్ ముస్తఫాకు సిల్వర్ మెడల్



చార్మినార్: యూఎస్ఏ న్యూయార్క్ నగరంలో జరిగిన మాస్టర్స్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీల్లో పాతబస్తీకి చెందిన హైదరాబాదీ బాక్సర్ హబీబ్ ముస్తఫా సిల్వర్ మెడల్ సాధించి మంగళవారం నగరానికి చేరుకున్నారు. ఈనెల 23 నుంచి 24 వరకు జరిగిన ఈ పోటీల్లో ఆయన 167 పాండ్స్ వేయిట్ విభాగంలో ఈ విజయం సాధించారు. ఆయన మాట్లాడుతూ..మన దేశం నుంచి తాను సిల్వర్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. తాను పాతబస్తీలో బాక్సింగ్ కోచింగ్ సెంటర్‌ను కొనసాగిస్తున్నానని.. ఇప్పటికే పలువురు విద్యార్థులు, యువకులకు ఉత్తమ శిక్షణను అందజేస్తున్నానన్నారు.

డీజీపీకి దట్టీ కట్టిన బీజేపీ నాయకుడు



చార్మినార్: పాతబస్తీలో షియా ముస్లింలు నిర్వహించిన అర్బెన్ ర్యాలీకి తగిన బందోబస్తు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా ముగిసిందని..ఇందుకు పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. ఈనెల 26న పాతబస్తీ వీధుల్లో షియా ముస్లింల అర్బెన్ ర్యాలీతో పాటు మొహర్రం సంతాప దినాల ప్రారంభం నుంచి తగిన ఏర్పాట్లు చేసినందుకు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలిసి దట్టీలు కట్టి ధన్యవాదాలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన పైపులైన్ పనులు చేపట్టామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మంగళవారం ఆయన రెయిన్‌బజార్ డివిజన్‌లోని చోటపూల్, సదత్‌నగర్, యశ్రఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పర్యటించారు. స్థానికంగా కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో ఆరా తీశారు. ఈ పర్యటనలో మజ్లిస్ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ శిక్షణ కేంద్రాలు విస్తరిస్తాం


శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఎండీ వేణుగోపాల్‌రావు

యాకుత్‌పురా: రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ శిక్షణ కేంద్రాలను విస్తరించి నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నామని ప్రభుత్వ రంగ సెట్విన్ శిక్షణ సంస్థ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఆయన మంగళవారం నగరంలోని పలు సెట్విన్ శిక్షణ కేంద్రాలను ఎండీ కే.వేణుగోపాల్‌రావుతో కలిసి సందర్శించారు. పురానీహవేలీ, మోతీగల్లీ కేంద్రాలలో కొనసాగుతున్న బ్యూటీషియన్, కట్టింగ్ అండ్ టైలరింగ్, కంప్యూటర్, ఎయిర్ టికెటింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ రిపేరింగ్ శిక్షణ తరగతులను పరిశీలించి అక్కడ ఫ్యాకల్టీలు అందిస్తున్న శిక్షణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రేటర్ హైదరాబాద్‌లో కొనసాగుతున్న శిక్షణ కేంద్రాలను సంగారెడ్డి, జహీరాబాద్, జడచర్ల, తాండూర్, వికారాబాద్‌లల్లో మొదట ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

పదోన్నతులు కల్పించడంపై జేఏసీ హర్షం


పదోన్నతులు పొందిన నర్సింగ్ సూపరింటెండెంట్స్

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1కు పదోన్నతులు కల్పించడంపై తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ కలిసి జేఏసీ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ..వైద్య విధాన పరిషత్‌లో 17 మంది నర్సింగ్ సూపరింటెండెంట్‌లకు గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 పదోన్నతులు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనర్‌కు ముఖ్య కార్యదర్శి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ పాండు, కో చైర్‌పర్సన్ శైలజ, మరియమ్మ,, సత్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, సంధ్య, వీరమ్మ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ శోభాయాత్ర


శోభాయాత్రలో ఎమ్మెల్యే రాజాసింగ్

అఫ్జల్‌గంజ్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని భాగ్యనగర్ శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా జరిగింది. గౌలిగూడలోని జంగల్ విఠోభా ఆలయం నుంచి ప్రారంభించి ఉస్మాన్ షాహి, గౌలిగూడల మీదుగా జాంబాగ్‌లోని యాదవ సంఘం వరకు కొనసాగింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు.

‘చివరకు న్యాయమే గెలిచింది’


బస్సులో మిఠాయిలు తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: అన్యాయంగా, అక్రమంగా ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసిన కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానం తగిన బుద్ధి చెప్పిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా రాజకీయ కక్షతో కవితను అరెస్టు చేయించారని, చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఎమ్మెల్సీ కవితకు మంగళవారం బెయిల్ రావడంతో ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. ఎంజేమార్కెట్ వద్ద ఆర్టీసీ బస్సులో మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రియాగుప్తా, మహ్మద్ సలీం, బాబ షర్ఫుద్దీన్, అర్జున్, అహ్మద్ పాల్గొన్నారు.

కనుల పండువగా ఉట్టి ఉత్సవాలు


వేడుకల్లో నాగేందర్ ముదిరాజ్, గిరిధర్ తదితరులు

అబిడ్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఉట్టి వేడుకలు జోరు నిర్వహించారు. గుడిమల్కాపూర్ సాయిబాబ త్రయంబకేశ్వర ఆలయంలో కనుల పండువగా ఉట్టి ఉత్సవాలు చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు గిరిధర్ ఉట్టి వేడుకలను ప్రారంభించారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని ఉట్టికొట్టే వేడుకల్లో పాలుపంచుకున్నారు. విజేతలను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినందన సంస్థ ఆధ్వర్యంలో సంఘమం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్‌కిశోర్‌కు మంగళవారం రవీంద్రభారతిలో అభినందన కల్చరల్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శోభారాజు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరి సమస్యను అర్థం చేసుకో గలిగిన స్వభావం ఉన్నవారు సమాజంలో మంచి ఆర్గనైజర్‌గా నెలదొక్కుకుంటారని తెలిపారు. 25 ఏళ్లుగా కళలకు, కళాసంస్థల అభ్యున్నతికి కృషి చేస్తున్న సంజయ్‌కిశోర్ సేవలను కొనియాడారు. అంతకు ముందు సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ పూర్వ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి, సినీ నటుడు తనికెళ్లభరణి, దర్శకుడు రేలంగి నర్సింహారావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఈ.భవాని, గౌరవ అధ్యక్షురాలు కేవీ.కృష్ణకుమార్, అధ్యక్షులు వసుంధర దేవి తదితరులు పాల్గొన్నారు.


సంజయ్‌కిశోర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న శోభారాజు, లక్ష్మీపార్వతి తదితరులు

చేనేత చీరలు దేశ సంస్కృతికి ప్రతిబింబం

● క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా

బంజారాహిల్స్: చేనేత చీరలు భారతదేశ సంస్కృతి, చరిత్రను ప్రతిబింబం చేస్తాయని వర్ధమాన నటి, క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బెంగాళ్ హ్యాండ్లూమ్ ఆర్ట్ సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత ఉత్పత్తులు కూడా డిజైనర్లు తయారు చేసిన ఉత్పత్తులకు దీటుగా విభిన్న రకాలుగా ఉంటున్నాయని ప్రతీ ఒక్కరికి మెచ్చేలా వీటిని తయారు చేస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 4వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చేనేతకారులు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిషిత్‌షా తెలిపారు.

మార్కెట్లోకి మచ్చర్‌దాన్..




వివిధ రకాల నైలాన్ దోమ తెరలు

చార్మినార్: దోమల నుంచి ఉపశమనం కోసం నిపుణుల పర్యవేక్షణలో కొత్త తరహా మచ్చర్‌దాన్ (దోమల తెర)లు అందుబాటులోకి వచ్చాయి. దోమల తెరలను వినియోగించండి..దోమల నుంచి రక్షణ పొందండి అంటూ మదీనాలోని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారీ కొత్త రకమైన నైలాన్ దోమ తెరలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. మంగళవారం తన షో రూంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ రకాల దోమల తెరల వివరాలను విలేకర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుటుంబ సభ్యులందరూ కలిసి నిద్రించడానికి వీలున్న దోమ తెరలతో పాటు చిన్నారులు, యువతీయువకులు వేర్వేరుగా నిద్రించడానికి వీలున్న దోమ తెరలను ఆకర్షణీయంగా అందుబాటు ధరల్లో ఉంచామన్నారు. నాణ్యతతో కూడిన దోమ తెరల ధరలు సామాన్యుల నుంచి ధనవంతుల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కెట్లో లభిస్తున్న వివిధ రకాల కాయిల్స్, ఆయింట్‌మెంట్లు సైడ్‌ఎఫెక్ట్స్ కలిగిస్తాయని..మచ్చర్‌దాన్‌ల వినియోగం ఎంతో మేలని ఆయన వివరించారు.

కాంగ్రెస్ పార్టీకి ఒక దినపత్రిక అవసరం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలకు పత్రిక, మీడియా చానెల్స్ ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకి కూడా ఒక పత్రిక అవసరమని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో ఇటీవల నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన అమీర్ అలీఖాన్‌ను పలువురు మైనార్టీ, కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి మీడియా అవసరం ఎంతగానో ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక దినపత్రికను ప్రారంభించాలని సూచించారు. శాసనమండలి సభ్యులు అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ..జర్నలిస్టుల సమస్యలపై మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. సీడబ్ల్యూసీ ప్రతినిధులు తారీఖ్ అహ్మద్, న్యాయవాది అఫ్సర్ యూసుఫ్ జాహీ, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ కార్పొరేటర్ మమత సంతోష్‌గుప్తా, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

గౌలిపురా: ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వినాయక ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆర్టీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ..వినాయక నిమజ్జనానికి అందరికి వాహనాలను ఇవ్వాలన్నారు. వినాయక ఉత్సవాలు, సామూహిక వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తాము పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి, సెక్రటరీ మహేందర్, రూప్‌రాజ్, ఆలే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీఏ అధికారులతో సమావేశమైన గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

బాలికతో అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

జియాగూడ: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ సాయిదుర్గానగర్‌లో ఓ కిరాణకొట్టు వద్దకు బాలిక (13) కొనడానికి వచ్చింది. అక్కడే ఉన్న ఉత్తరప్రదేశ్ మహారాజ్ గంజ్ జిల్లాకు చెందిన సయ్యద్ సాజీద్(52) గత ఐదు నెలల క్రితం నగరానికి వచ్చి స్టేషనరి వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో స్టేషనరి విక్రయించే క్రమంలో సాయిదుర్గానగర్‌లో గల ఓ కిరాణా కొట్టు వద్ద స్టేషనరి సప్లయ్ చేస్తున్నాడు. అక్కడకు వచ్చిన మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక పక్కనే గల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు వెంటనే వచ్చి సయ్యద్ సాజీద్‌ను దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇమాంపురాలో..

బాలిక ఇంట్లో స్నానానికి వెళ్తుండగా పక్కనే ఉండే ఓ వ్యక్తి అటకాయించి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. జియాగూడ ఇమాంపురాలో ఉంటున్న ఓ బాలిక మూడు నెలల క్రితం స్నానం కోసం బాత్‌రూమ్‌కు వెళ్తుండగా అద్దె గదిలో ఉండే శ్యామ్ సుందర్(21) అసభ్యంగా ప్రవర్తించాడు. మూడు నెలల తర్వాత మరోసారి అసభ్యంగా ప్రవర్తించడానికి యత్నించగా కుటుంబసభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.